నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | శనివారం 20 ఏప్రిల్ 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY

మాట్లాడుతున్న బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, చిత్రంలో వరంగల్ అభ్యర్థి సుధీర్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య తదితరులు

దమ్ముంటే రాజీనామా చెయ్.. నువ్వా.. నేనా తేల్చుకుందాం

కేసీఆర్‌కు నమ్మక ద్రోహం చేసిన కడియం అంతు చూస్తా

ఆయన రాజకీయ జీవితాన్ని భూస్థాపితం చేయడమే నా లక్ష్యం

శ్రీహరిపై మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య ఫైర్

వరంగల్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని పిలుపు

ఉత్సాహంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనం

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 19 : 'దళిత ద్రోహి కడియం శ్రీహరి.. నీకు దమ్ముంటే రాజీనామా చెయ్.. ఎన్నికల్లో నిలబడు.. నువ్వో నేనో ఇద్దరం తేల్చుకుందాం. నా ఏకైక లక్ష్యం నీ పతనమే' అంటూ మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య కడియంపై నిప్పులు చెరిగారు. హనుమకొండలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనం జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.. కడియం శ్రీహరి చరిత్రహీనుడిగా మిగిలిపోవడం ఖాయమన్నారు. దళిత ద్రోహి కడియంపై మూడు సార్లు 12వేలు, 33వేలు, 58వేల మెజార్టీతో గెలిచానని, 2009లో స్టేషన్ ఘన్‌పూర్‌లో శ్రీహరిపై గెలిస్తే దుర్మార్గుడిని ఓడించావని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తనను మెచ్చుకున్నాడని, కాంగ్రెస్‌లో ఉండి ఎంజీఎం దవాఖానలో జై తెలంగాణ అన్నానని గుర్తుచేశారు. దేవుడి లాంటి కేసీఆర్ తనకు ఉపముఖ్యమంత్రి పదవి ఇస్తే మళ్లీ తన వెనకాలే వచ్చి లేనిపోని మాటలు చెప్పి, కుట్రలు, కుతంత్రాలు చేసి తన పదవి లాక్కున్నాడని విమర్శించారు. కొనఊపిరితో ఉన్న తనకు కేసీఆర్ నుంచి మళ్లీ పిలుపు వచ్చిందని, తన పని నమ్మకద్రోహి కడియం శ్రీహరి అంతు చూడడమేనన్నారు. తనను రాజకీయాల్లోకి ప్రణయ్‌భాస్కర్ ఆహ్వానించారని, టీడీపీ హయాంలో స్టేషన్ ఘన్‌పూర్‌లో నిలబడమని అడిగితే తిరస్కరించి కడియం పేరు ప్రతిపాదించానని, ఇప్పుడు చింతిస్తున్నానని తెలిపారు. పశ్చిమ నుంచే మళ్లీ గులాబీ జెండా ఎగిరే ఉద్యమం మొదలవ్వాలన్నారు. ప్రస్తుతం తెలంగాణ మొత్తం వరంగల్ వైపు చూస్తోందని, బీఆర్ఎస్ తరపున బరిలో నిలిపిన సుధీర్‌కుమార్‌ను గెలిపిద్దామని ప్రజలకు పిలుపునిచ్చారు.

కడియం-అరూరి గురుశిష్యులు

- బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి, జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్

నేను పార్టీ కార్యకర్తనే. కేసీఆర్ వెంట 2001 నుంచి నడిచాను. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు కడియం శ్రీహరికి నాకు మధ్య. నాకు పోటీ కడియం కావ్య కాదు. నేను జడ్పీ చైర్మన్ పదవికి రాజీనామా చేస్తాను. కడియం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి. ఇద్దరం బరిలో నిలిచి గెలుపెవరిదో తేల్చుకుందాం. యువత ఆలోచించాలి.. పదేండ్లలో కేసీఆర్ పాలనలో తెలంగాణలో జరిగిన అభివృద్ధి, కేంద్రంలో జరిగిన అభివృద్ధిని బేరీజు వేయండి. మోదీ ఏ వర్గానికి చేసింది ఏమీ లేదు. కడియం-అరూరి గురుశిష్యులు. రెండు పాములు ఒకే పుట్టలో నుంచి వచ్చాయి. తెలంగాణ కోసం కొట్లాడిన బీఆర్ఎస్ పార్టీని ఆదరించండి. మొదటిసారి అసెంబ్లీలో తెలంగాణ పదాన్ని వాడిన ప్రణయ్ అన్నకు జోహార్లు.

మాట్లాడుతున్న తాటికొండ రాజయ్య

శ్రీహరికి ఎమ్మెల్యే పదవి బీఆర్ఎస్ భిక్ష.. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్

పార్టీకి ద్రోహం చేసిన వారిని ప్రజాక్షేత్రంలో బరాబర్ ఎండగడుతాం. కడియం వ్యవహారశైలి పచ్చని చేను కాడ దొబ్బితింటా.. వెచ్చగా పంట అనే తీరు. ఎమ్మెల్యే పదవి బీఆర్ఎస్ పార్టీ పెట్టిన భిక్ష. వెంటనే పదవికి రాజీనామా చేయాలి. ధైర్యం ఉంటే పోటీలో నిలబడాలి. వారికి ఓటుతో బుద్ధి చెప్పాలి. ఆనాడు స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన బొజ్జపెల్లి రాజయ్య, తాటికొండ రాజయ్యలపై కుట్ర చేసిండు. ఎన్టీఆర్, లక్ష్మీపార్వతి కాళ్లు మొక్కి మంత్రి పదవి తెచ్చుకున్నడు. అనంతరం వారిద్దరికీ వెన్నుపోటు పొడిచి చంద్రబాబు పంచన చేరిండు. తెలంగాణ వచ్చినంక కేసీఆర్ చేరదీశారు. కానీ పార్టీకి ద్రోహం చేసిండు. కాంగ్రెస్ శాసనసభ్యులు నాలుగు నెలల్లో నాలుగు రూపాయలు తేలే. పార్టీ కార్యాలయం జోలికి వస్తే ఊరుకోం.

ప్రజలకు కాంగ్రెస్ ధోకా.. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

కడియం కావ్యకు టికెట్ ఇచ్చాక మోసం చేసి పార్టీ మారారు. కాంగ్రెస్‌కు ఓట్లు వేసి తప్పు చేశామని ప్రజలు ఇప్పుడు బాధపడుతున్నారు. నెలలో మరమ్మతులు చేయాల్సిన కాళేశ్వరం ప్రాజెక్టును పట్టించుకోవడం లేదు. కాంగ్రెస్‌కు పరిపాలించే విజ్ఞత లేదు. సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి.

కాంగ్రెస్ వాళ్లే కావ్యను ఓడిస్తారు

కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్

కడియం శ్రీహరి, అరూరి రమేశ్ ఇద్దరూ ద్రోహులే. కాంగ్రెస్ వాళ్లు కసిగా ఉన్నారు కావ్యను ఓడించడానికి.. బీజేపీ, కాంగ్రెస్సోళ్లే సుధీర్ కుమార్‌ని గెలిపించాలనుకుంటున్నారు.

'దేఖ్‌లేంగే.. ఔర్ ఏక్ దక్కా.. కేసీఆర్ పక్కా'

ఆత్మీయ సమ్మేళనంలో తాటికొండ రాజయ్య కార్యకర్తల్లో నూతనోత్సాహం నింపారు. 'దేఖ్‌లేంగే.. ఔర్ ఏక్ దక్కా.. కేసీఆర్ పక్కా' పాటకు రాజయ్య విజిల్ వేస్తూ నృత్యం చేశాడు. సమావేశంలో కార్పొరేటర్లు బోయినపల్లి రంజిత్‌రావు, చెన్నం మధు, మాజీ డిప్యూటీ మేయర్ ఖాజా సిరాజుద్దీన్, నాయకులు పులి రజినీకాంత్, డివిజన్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి చందర్, కంజర్ల మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

పెద్దపల్లిలో కొప్పుల నామినేషన్

జయశంకర్ భూపాలపల్లి, ఏప్రిల్ 19(నమస్తే తెలంగాణ): పెద్దపల్లి పార్లమెంట్ స్థానానికి బీఆర్ఎస్ అభ్యర్థిగా కొప్పుల ఈశ్వర్ శుక్రవారం నామినేషన్ (రెండు సెట్లు) దాఖలు చేశారు. ఆయన వెంట పెద్దపల్లి, రామగుండం, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, కోరుకంటి చందర్, దుర్గం చిన్నయ్య ఉన్నారు. కాగా నామినేషన్ కార్యక్రమానికి భూపాలపల్లి జిల్లాలోని ఐదు మండలాల ముఖ్య నేతలు తరలివెళ్లారు.

రెండో రోజు ఏడు నామినేషన్లు

వరంగల్ లోక్‌సభకు 3, మహబూబాబాద్‌కు 4 నామినేషన్లు

వరంగల్, ఏప్రిల్ 19(నమస్తేతెలంగాణ)/మహబూబాబాద్: వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాలకు రెండో రోజు శుక్రవారం ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. వరంగల్‌లో ముగ్గురు, మహబూబాబాద్‌లో నలుగురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. వరంగల్‌లో రాష్ట్ర సమాఖ్య పార్టీ అభ్యర్థిగా నేనా ప్రేమ్‌రెడ్డి రిపిక, స్వతంత్ర అభ్యర్థిగా పెరంబుదూరి కృష్ణసాగర్, బీఎస్పీ అభ్యర్థిగా పంజా కల్పన తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి పీ ప్రావీణ్యకు అందజేశారు. ప్రేమ్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా కూడా నామినేషన్ దాఖలు చేశారు. కృష్ణసాగర్, పంజా కల్పన ఒక్కో సెట్, ప్రేమ్‌రెడ్డి రెండు సెట్లు నామినేషన్ పత్రాలను సమర్పించారు. దీంతో నామినేషన్లు దాఖలు చేసిన మొత్తం అభ్యర్థుల సంఖ్య ఆరుకు చేరింది. ఇక్కడి నుంచి బరిలోకి దిగే ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు మంచి ముహూర్తం కోసం వేచి చూస్తున్నారు. అదే విధంగా

మహబూబాబాద్‌లో నామినేషన్ అందిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్

మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోరిక బలరాంనాయక్ రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా పాల్వంచ దుర్గ, ఆధార్ పార్టీ బలపరిచిన అభ్యర్థిగా జాటోత్ రఘునాయక్ ఒక్కో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా బోడ అనిల్ నాయక్ ఒక సెట్ నామినేషన్‌ను జిల్లా రిటర్నింగ్ అధికారి అద్వైత్‌కుమార్ సింగ్‌కు అందించారు. రెండు రోజుల్లో మొత్తం ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆర్వో వెల్లడించారు.

ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ఉండదు

రసమయి బాలకిషన్, మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే

పార్లమెంట్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండదని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డితోఉన్నోళ్లే ఆయన సీటుకు ఎసరు పెట్టడం ఖాయమన్నారు. 5 ఏండ్లలో ఎంపీ బండి సంజయ్ పార్టీ కోసం పని చేశాడే తప్ప, ప్రజల బాగోగులు పట్టించుకోలేదన్నారు. ప్రజల మనోభావాలతో బండి సంజయ్ రాజకీయం చేస్తున్నాడని, గత ఎన్నికల్లో ఆయనకు ఓట్లు వేసి ప్రజలు ఇప్పుడు తిప్పలు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో హుజూరాబాద్ ఇన్‌చార్జి గెల్లు శ్రీనివాస్‌యాదవ్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండా శ్రీనివాస్, ఎంపీపీ మేకల స్వప్న, మండలాధ్యక్షుడు పిట్టల మహేందర్, కేడీసీసీ డైరెక్టర్ శ్రీపతి రవీందర్‌గౌడ్, వైస్ ఎంపీపీ తంగెడ నగేశ్, నాయకులు కడారి రాజు, తంగెడ మహేందర్, ఎల్తూరి స్వామి, మునిగడప శేషగిరి, గొల్లె మహేందర్ పాల్గొన్నారు.

రోడ్‌షోలో అభివాదం చేస్తున్న వినోద్‌కుమార్, చిత్రంలో సుధీర్‌కుమార్ తదితరులు

కాంగ్రెస్, బీజేపీ దగాకోరు పార్టీలు

పేరుకే జాతీయ పార్టీలు.. తెలంగాణ అభివృద్ధికి చేసింది శూన్యం

పార్లమెంట్‌లో తెలంగాణ గొంతుక వినిపించేది బీఆర్ఎస్సే

మేడిగడ్డ కింద 5వేల క్యూసెక్కుల నీళ్లు పోతుంటే రాష్ట్ర సర్కారు ఏం చేస్తోంది?

రూ. 500 బోనస్, రుణమాఫీ ఏమైంది?

కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ ధ్వజం

ఎల్కతుర్తిలో రోడ్ షో

వినోద్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

వొడితెల సతీశ్‌కుమార్, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో మార్పు మార్పు అని కాంగ్రెస్ చెబితే నమ్మి ఓట్లేసిన జనం ఇప్పుడు బాధపడుతున్నారని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దేవాదుల నీళ్లను నార్త్ కెనాల్ ద్వారా తీసుకొచ్చి చెరువులు నింపామని గుర్తు చేశారు. ఇప్పుడు నీళ్లు లేక పొలాలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఎల్కతుర్తి, ఏప్రిల్ 19 : పార్లమెంట్‌లో తెలంగాణ ప్రజల గొంతుక వినిపించేది కేవలం బీఆర్ఎస్సే అని కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలో నిర్వహించిన రోడ్ షోకు మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, వరంగల్ బీఆర్ఎస్ అభ్యర్థి, జడ్పీ చైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్‌తో కలిసి వినోద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పుట్టిందే తెలంగాణ ప్రజల కోసమని, ఇప్పుడు మన పిల్లల కోసం పార్లమెంట్‌లో తమ గొంతుక వినిపించాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులు ఎంపీలుగా ఉండాలన్నారు. తాను ఎంపీగా ఉన్న సమయంలోనే ఎల్కతుర్తి మీదుగా జాతీయ రహదారిని మంజూరు చేయించానని గుర్తు చేశారు. కృష్ణ, గోదావరి నదులపై నిర్మించిన అనేక సాగునీటి ప్రాజెక్టుల అనుమతి కోసం కేసీఆర్ సూచన మేరకు కృషి చేశానని తెలిపారు. కరీంనగర్ సిటీ అభివృద్ధి కోసం రూ. 1000 కోట్లు తెచ్చానని చెప్పారు. 9వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు అనుమతులు తీసుకొచ్చినట్లు వివరించారు. అలాగే కరీంనగర్ నుంచి హైదరాబాద్ వరకు రైలు మార్గం కోసం కృషి చేశానన్నారు. 75ఏండ్ల స్వాతంత్ర్య దేశంలో పేదవాడికి, ధనికుడికి అంతరం పెరుగుతున్నదే తప్ప తగ్గడం లేదన్నారు. అదానీ, అంబానీల అస్తులు పెరుగుతుంటే పేదవాడు మరింత పేదరికంలోకి కూరుకుపోతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. పేదవారి అకౌంట్లలో రూ. 15లక్షలు వేస్తానన్న మోదీ మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. విజయ్‌మాల్యా, నీరవ్‌మోదీలు లండన్‌లో దాక్కుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం ఈడీ, సీబీఐ కేసులతో విపక్షాలను లొంగదీసుకోవాలని చూస్తున్నదని, సుజనాచౌదరి రూ. 800 కోట్ల ఆర్థిక నేరానికి పాల్పడి బీజేపీలో చేరితే ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఇప్పుడు మళ్లీ ఎంపీగా టికెట్ ఇవ్వడం విచారకరమని చెప్పారు. ఈ రెండు పార్టీలు తెలంగాణకు చేసింది శూన్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం అబద్ధాల పునాదుల మీదే ఏర్పడిందని, ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందన్నారు. మేడిగడ్డ కింద 5వేల క్యూసెక్కుల నీళ్లు వృథాగా పోతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తున్నదని ప్రశ్నించారు. రైతులు బాగుపడడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదని, అందుకే దేవాదుల నుంచి నీటిని పంపింగ్ చేయడం లేదని ఆరోపించారు. ఎన్నికల హామీలో రైతులకు రూ. 500 బోనస్ ఇస్తామని, రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని, ఆ హామీ ఏమైందన్నారు. ఇప్పుడు ఆగస్టు 15లోగా రుణమాఫీ అంటున్నారని, తర్వాత జనవరి 26 అంటారని ఎద్దేవా చేశారు. 24ఏండ్ల నుంచి తెలంగాణ ప్రజల పక్షాన పోరాడుతున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ అన్నారు.

మీటింగ్ కోసం సీఎం వెయిటింగ్

వేదిక వద్దకు 3.45 గంటలకే చేరుకున్న రేవంత్

జనం కోసం గంటన్నర పాటు బస్సులోనే నిరీక్షణ

మహబూబాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): మానుకోటలో కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ కోసం 'జన జాతర' పేరిట ఏర్పాటుచేసిన సభా వేదిక వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెయిట్ చేయాల్సి వచ్చింది. సాయంత్రం 4గంటలకు సభ ఉందని కార్యకర్తలకు సమాచారం ఉండగా, సీఎం రేవంత్ మహబూబ్‌నగర్ నుంచి హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 3.45గంటలకు మానుకోటలో దిగారు. అయితే అప్పటికీ ఇంకా జనం రాకపోవడంతో కాంగ్రెస్ నాయకులు రేవంత్‌రెడ్డిని ఏసీ బస్సులో వెయిట్ చేయాలని చెప్పారు. ఇలా పావుగంట, అరగంట కాదు ఏకంగా గంటన్నర జనం కోసం నిరీక్షించారు.

సీఎం బస్సులోనే ఉండగా మంత్రులు సీతక్క, పొంగులేటి, తుమ్మల నాగేశ్వర్‌రావుతో పాటు ఎమ్మెల్యేలు స్టేజీ మీద కూర్చుండిపోయారు. స్థానిక ఎమ్మెల్యే మురళీనాయక్, ప్రభుత్వ విప్ రాంచందర్‌నాయక్ మైక్‌లో సభా ప్రాంగణానికి ఎడమ వైపు, కుడి వైపు కుర్చీలు ఖాళీగా ఉన్నాయని, కార్యకర్తలు వచ్చి సీట్లలో కూర్చోవాలని పదే పదే మైకులో చెప్పడం కనిపించింది. 3.45 గంటలకు అక్కడికి వచ్చిన సీఎం సభా వేదికపైకి సాయంత్రం 5.15గంటలకు వేదిక పైకి వచ్చి ప్రసంగించారు.

సభా ప్రాంగణంలో జనం లేక బస్సులోనే వేచి ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి

సీఎం సభలో ముదిరాజ్‌లకు అవమానం

ముదిరాజ్ మహాసభ

జిల్లా కార్యదర్శి సూరయ్య ఆవేదన

వేదికపైకి పిలువకపోవడంపై ఆగ్రహం

కేసముద్రం : మహబూబాబాద్ కాంగ్రెస్ సభలో ముదిరాజ్‌లను అవమానించడం సరికాదని ముదిరాజ్ మహాసభ జిల్లా కార్యదర్శి ఎదరబోయిన సూరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో లక్షా 60వేల ముదిరాజ్ ఓటర్లు ఉండగా, సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్న బహిరంగ సభలో సభా వేదికపై ముదిరాజ్‌లకు అవకాశం కల్పించకుండా మనోభావాలను దెబ్బతీశారని తెలిపారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబాబాద్, డోర్నకల్, పాలకుర్తి, ఇల్లెందు, ములుగు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ఎంతో కృషిచేశామని తెలిపారు. పార్టీలో సీనియర్ నాయకులు ఉన్నప్పటికీ వేదికపైకి పిలువకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పిస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి కేవలం ఓటు బ్యాంక్‌గానే వాడుకుంటూ విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పించిందని, ముదిరాజ్‌ల అభ్యున్నతికి పాటుపడిందని వివరించారు. వేసవిలోనూ చెరువులకు నీటిని విడుదల చేయడం వల్ల చేపల లభ్యత పెరిగి ఆర్థికంగా ప్రయోజనం చేకూరిందని పేర్కొన్నారు. ముదిరాజ్‌లను పట్టించుకోని కాంగ్రెస్ పార్టీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని, బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవితకు ఓటు వేసి గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

మానుకోటలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన బలరాంనాయక్

మోదీకి ఓట్లడిగే హక్కు లేదు

విభజన హామీలు నెరవేర్చని వారికి ఎందుకు వేయాలి?

దేశ ప్రజల సొమ్మంతా కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతున్నడు

మానుకోట సభలో సీఎం రేవంత్‌రెడ్డి

మహబూబాబాద్, ఏప్రిల్ 19 : విభజన సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చని మోదీకి ఓటడిగే హక్కులేదని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలుపును కాంక్షిస్తూ స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చాక అవినీతి సొమ్మును బయటకు తీసి పేదల బ్యాంకు ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తానని మాయమాటలు చెప్పి మోసం చేశారన్నారు. దేశంలోని 97శాతం మంది సొమ్మును 3శాతం ఉన్న కార్పొరేట్ సంస్థలకు మోదీ దోచిపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీని స్థాపించేందుకు సోనియమ్మ ప్రయత్నం చేస్తే బీజేపీ ఫ్యాక్టరీ ఊసెత్తలేదని మండిపడ్డారు. అలాంటి బీజేపీకి ఓటు వేస్తారా? అని ప్రజలను ప్రశ్నించారు. కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీని తమకు అనుకూలమైన నాగ్‌పూర్‌కు తరలించారని, అలాంటి మోసపూరిత బీజేపీకి ఓటు వేయవద్దని విజ్ఞప్తి చేశారు. బలరాంనాయక్ అందరివాడని, అందరూ ఓటు వేసి రాహుల్ ఆధ్వర్యంలో దేశంలో ఏర్పడబోయే ఇండియా కూటమి ప్రభుత్వం నుంచి మంత్రి పదవి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 14 మంది ఎంపీలను గెలిపిస్తే వాళ్లను నేను, మా మిత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావులం వెంట బెట్టుకుని ఢిల్లీకి వెళ్లి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కావాల్సిన నిధులు తీసుకొస్తామన్నారు. భద్రాచలం సాక్షిగా, సోనియమ్మ, రాహుల్ మాటగా రైతులకు రూ.2 లక్షల రుణాన్ని మాఫీ చేస్తామన్నారు. రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల కంటే ఖమ్మం, మహబూబాబాద్‌లోనే అత్యధిక మెజార్టీ వస్తుందని చెప్పారు. తెలంగాణను ఇచ్చిన సోనియాగాంధీ కొడుకు రాహుల్‌ను పీఎం చేయడమే లక్ష్యంగా ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రోహిత్ చౌదరి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, సీతక్క, ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, జాటోత్ రాంచంద్రునాయక్, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, యశస్వినీరెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల ఫిర్యాదుల కోసం సంప్రదించాలి

ఖిలావరంగల్, ఏప్రిల్ 19 : పార్లమెంట్ ఎన్నికల అంశాలకు సంబంధించి ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు తమ ఫిర్యాదులు, సలహాలు, సూచనల కోసం ఎన్నికల వ్యయ పరిశీలకులను సంప్రదించవచ్చని వరంగల్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పీ ప్రావీణ్య తెలిపారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని 99-స్టేషన్‌ఘన్‌పూర్, 100-పాలకుర్తి, 104-పరకాల, 105-వరంగల్ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన వారు ఎన్నికల వ్యయ పరిశీలకుడు ఏ దిలీబన్ 8309921306, 106-వరంగల్ తూర్పు, 107-వర్ధన్నపేట, 108-భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల వ్యయ పరిశీలకుడు ధీరజ్‌సింగా 8309952057 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. అలాగే, నేరుగా హరిత హోటల్‌లోని సూట్ నంబర్ 309లో దిలీబన్‌ను, సూట్ నంబర్ 314లో ధీరజ్ సింగాను రోజూ సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య కలిసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.